చారిత్రక కథ :

# ఆంధ్ర మహాభారతము

పసుపులేటి మల్లికార్జునరావ్

ఒకానొక నాటి సువర్ణసుప్రభాతము. పరమపవిత్రమగు గోదావరీ తీరము. వైభవోపేతమగు వేంగీ రాజ్య రాజధానీ నగరము. రాజమహేంద్రవరపురము.

భూసురోత్తముల వేదఘోషలు, దిగంతముల పరువిడుచున్నవి. మహోన్నతములైన సౌధరాజములు, ఆకసమున కంటుచున్నట్లున్నవి. ప్రభాకరుడు మింటికెగయుచున్న కొలది, క్రమక్రమముగ విశాలమగు రాజవీధులు, జనసాంద్రము లగుచున్నవి. మనుష్యులు కోలాహలముగ, తమ తమ పనులను చక్కబెట్టుకొనుటకై, వీధులందు అటునిటు తిరుగాడు చున్నారు.

సమున్నతముగను, సుందరముగను, కట్టబడిన భవనమది. అది – సభాభవనము.

ప్రభుత్వోద్యోగులు, పురప్రముఖులు, యుచితాసనముల నలంకరించినారు కొందరు ప్రజలుకూడ వచ్చినారు. వారికి ప్రత్యేకింపబడిన స్థానములందు కూర్చొనినారు.

ప్రభువులింకనూ సభకు వేంచేయలేదు, అందుకు ఇంకనూ కొలది వ్యవధి యున్నది. అందుచేతనే కాబోలు – ప్రతివారును, తమ తమ ప్రక్కవారితో, నేదో లోకాభి రామాయణము ముచ్చటించుకొనుచున్నారు సభాభవనము అంతయు కలకల ధ్వనులతో, నిండి యున్నది

ఒక్కమారుగ – గంభీరమగు ఘంటికారావమొకటి – ఆ రణగొణ ధ్వనులను చీల్చుచు, విన్పించినది. అది యెంత గంభీరముగ మ్రోగినదో, హఠాత్తుగనే సభయంతయు, నిశ్శబ్దమైనది.

మహారాజు అంతఃపురమునుండి బయలుదేరిరి ప్రజలు సావధానులై యుండవలెను, అని హెచ్చరించుటకే, ఆ గంటమ్రోత.

కొలది క్షణములలోనే, మహారాజు సింహాసన మలంకరించును !

సభాసదులందరును – మర్యాదా పూర్వకముగ లేచి నిలుచుండినారు. ఆయన సభాభవనము ప్రవేశించు ద్వారమువైపే జూచుచున్నారు.

......జయ జయ జయ – జయ మహారాజ తూర్పు చాళుక్యరాజేంద్ర, వేంగీరాజ్య రమానాథ, రాజమహేంద్ర వరపురాధీశ, రాజరాజ నరేంద్ర నామధేయ – విష్ణువర్ధన మహారాజ, జయ జయ జయ......

వంది మాగధులు స్తోత్రములు చేయుచున్నారు. విప్రోత్తములు మంగళా– శాసనములు చదువుచున్నారు. రాజ రాజ నరేంద్రుడు ఠీవిగ సభావేదిక నెక్కినాడు.

సభాసదులు వందనపూర్వకముగ, తలలు వంచినారు. మహారాజు మరల సవినయముగ తలవంచి ప్రతి నమస్కరించినాడు.

సభ నొకపరి సారించి జూచి – ఉన్నత వేదికపై నమర్చబడిన, సువర్ణ రత్న ఖచిత మణిమయ సింహాసనమును అలంకరించినాడు. ప్రభువు ఆసీనుడు కాగానే, మిగత సభాసదులందరు – యథాస్థానములందు కూర్చొనినారు.

శరీరము నాచ్ఛాదించియున్న గాచయముడుపులు, ఆయన ఠీవిని ఇనుమడింపజేయుచున్నవి. వస్త్రములకు తాపడము చేయబడిన రతనములు, కెంపులు మొదలగు మేలిరతపు రాళ్లయొక్క శోభ, మహారాజు ఠీవిని మరింత ఎక్కువ జేసినవి. కటిభాగమున– పిడికి మణి పొదగబడిన– కరవాలమొకటి ఒరయం దిముడ్చబడి–వేలాడుచున్నది.

ఆయన కూర్చొనుచునే – కుడిప్రక్క – మరియొక ఉన్నతాసనమువైపు చూసినాడు. అది శూన్యముగ కన్పించినది.

'కవివరేణ్యులింకను రాలేదా?' ప్రభువెవరిని ఉద్దేశించి యీ మాట అనెనో, ఎవరికిని తెలియలేదు. ఆయన ప్రధానద్వారమువైపు జూచుచు అనినాడీ మాటలను.

'చిత్తము! వారు గృహమునుండి వెలుపలికి బయలు దేరియే యుందురు. వారి గృహమునుండి సభకు వచ్చుటకు, కొంత వ్యవధి పట్టునన్న విషయము తామెరింగినదే! మొదటి వరుసలో కూర్చొనియున్న కవి యొకరు సమాధానము నొసంగెను.

ఏలనో ఆ దినము ప్రభువు – కవివరేణ్యునితో మాటాడవలెనను ఆతురతతో యుండెనని ఆ కవి గ్రహించెను. అందులకు కారణమేమో, ఆయనకు మాత్రము బోధపడలేదు. ఏదియో ఊహించుకొనుచు నిశ్శబ్దముగ పీఠముపై కూర్చొనినాడు.

అంతలో నిరువురు భటులు సభను ప్రవేశించిరి. రాజరాజునకు దండమాచరించి 'శ్రీ నన్నయభట్టారకుల వారు వేంచేయుచున్నారు' అని చెప్పి – నిష్క్రమించినారు.

రాజరాజు ఆసనమునుండి లేచెను. సభికులూ లేచిరి.

ప్రతిదినము రాజరాజిదే విధముగ వారికి ఎదురేగి, దోడ్కొనివచ్చి ఆసనమలంకరింపజేసెదరు. నన్నయ భట్టారకులు వేదోక్తముగ రాజరాజును ఆశీర్వదించిన పిదప, సభ ప్రారంభమగును.

ఇది నిత్యకృత్యమే అయినను అది చూచువారికి ఏదో విశేషత గోచరించును

రాజరాజు ముఖద్వారము చేరుసరికి– వెంట శిష్యులు, మొదలగు పరివారముతో నన్నయభట్టారకులే ఎదురైనారు.

మహారాజాయన పాదములు స్పృశించి, అభివాదము సల్పినాడు.

నన్నపార్యుని గంభీరనిస్వనము, వేదోక్తమగు దీవనలతో సభాభవనమున మార్మోగినది.

మహారాజు – ఆయనను దోడ్కొని వచ్చి– ఉచితాసనమున ఆసీనుని గావించినాడు.

పిదప, నన్నయభట్టారకుడు దండగిని కూర్చొనుమన్నట్లు చేతులను ఊపినాడు. అందరు కూర్చొనిరి

రెండుక్షణముల సమయము– రాజరాజునకు బదులు – నిశ్శబ్దమే ఆ భవనమున రాజ్యము చేసినది.

నన్నయ – ఇంతకు ముందు, రాజరాజునకు జవాబు యిచ్చిన వ్యక్తివైపు సాదరపూర్వకముగ చూసి – చిర్నగవున రాజరాజువైపు తిరిగి యిట్లనినాడు 'రాజేంద్రా!'

'ఏమిఆనతి కవీంద్రా?' ప్రాసకలుపుచు, ఛలోక్తి యొకటి విసరినాడు రాజరాజు,

ప్రేక్షకులు నవ్వును ఆపుకొనిరి. నన్నపార్యుడట్లే రాజరాజును జూచుచు తలయూచినాడు. అటు సరసుడైన మహారాజు! ఇటు సాహిత్యశేఖరుడగు కవిరాజు! ఇందెవరు తక్కువ?

'విశేషములేమి?' నన్నయ ప్రశ్నించెను.

'అంతయు యధావిధిగనే యున్నది' రాజరాజు ప్రత్యుత్తరము నొసంగెను.

మరల చాలసేపు నిశ్శబ్దము!

రాజరాజు మనసు నందేదియో విషయము మెదులుచున్నట్లు, నన్నయభట్టారకుడు తెలుసుకొనగలిగినాడు. ఎందులకనగ – క్షణక్షణమునకు, రాజరాజు నన్నపార్యుని వదనము చూచుచుండెను. మరల నేదో ఆలోచనల బడిపోవును.

సాభిప్రాయముగ – ఇందొకటి వ్యక్తివైపు జూచినాడు. ఆ వ్యక్తి పేరు నారాయణభట్టు

నారాయణ భట్టు ప్రత్యుత్తరపూర్వకముగ తల నాడించుచు, శబ్దము చేయకుండ నవ్వినాడు. నన్నయ భట్టారకులు, నారాయణ భట్టూ – ఏదియో మూగభావంతో మాటలాడుకొనుటను – అల్లంతదూరమున నున్న మరియొక వ్యక్తి గ్రహించినాడు. అతడు పావులూరి మల్లన.

ఎవ్వరును మాటలాడుటలేదు.

అటు నిటు జూచి, మల్లన లేచి నిలుచుండినాడు. వినయము ప్రస్ఫుటమగు కంఠమున – 'ప్రభూ!' అనినాడు.

'ఆఁ! ఆఁ! ఏమి మల్లనార్యా?' ఆలోచనలందు మునిగి తేలుచున్న రాజరాజు యులిక్కిపడినాడు.

'ప్రభువులేలకో అన్యమనస్కులై యున్నారు.'

'అహా...అదేమియునులేదు. ఏదియో చిన్న విషయమును గూర్చి ఆలోచించు చున్నాము'

'అది మేము వినగూడని విషయమా రాజరాజా?' నారాయణభట్టు అడిగినాడు.

'కాదు! కాదు! నిజమునకిది చిన్న విషయమని, విజ్ఞులెవ్వరు తలంచరు. అందుచేత యీ కార్యమునకు సమర్థులెవ్వరా,యని మాసమస్య'

'అదియేమో వివరింపుము రాజరాజా! పెద్దలు, పండితులు, అందరును గలసి మీ సమస్య దీర్ప యత్నించెదము' వయసు మళ్లిన వృద్ధసామంత మండలేశ్వరు లొకరు అనిరి.

'చెప్పెదము! చెప్పెదము! ముందీ విషయము తెలుపుడు – నన్నపార్యా! సభాసదులలోగానీ, మీరుగానీ ఎన్నడైన మహాభారతమును, తెలుగున వినియున్నారా?'

ఆ ప్రశ్నకు సభ దిమ్మెరపోయినది. నన్నయ, నారాయణభట్టు తెల్లబోయినారు.

ఇదియేమి? ప్రభువులకు మతిస్థిమితము దప్పలేదుగదా? లేక? సంస్కృత వ్యాసమహాభారతమురయేమి? తెనుగున వినుటయేమి?

నన్నయ భట్టారకులు – రాజరాజేదియో మహాకార్యమును తలపెట్టినాడని, ఆ కార్యమునకు ఇందాకటి ప్రశ్నకు గల సంబంధము నూహించుచున్నారు.

'ఏమి?' మరల మహారాజు కంఠము వినిపించినది.

'లేదు ప్రభూ! ఇంతవరకును మే మెవ్వరము వినియుండలేదు.' సభాసదుల పక్షమున మల్లనార్యుడు అనెను.

'మేము వినగోరుచున్నాము!' ఆజ్ఞాపించుచున్నట్లున్నది కంఠము.

నిజముగనే ప్రభువులకు మతి చలించెను! తెనుగున లేని వ్యాసభారతము నెవ్వరు వినిరి? అసలు భారతము నింతవర కెవ్వరైన తెనిగించితిరా? తెనిగించుటమాని – కనీసము-అందులకు తలపెట్టిరా? అసలా మాట వారి మస్తిష్కములందు జొచ్చినదా? లేనిదానిని ఎచ్చటి నుండి తెచ్చి వినిపించగలరు?

సభయందు హాహాకారములు చెలరేగినవి.

'ప్రభూ! తమకోరికయేమి? లేని విషయముల నెట్లుచేసి చూపించగలము. తమరే యోచింపుడు. ఇంతవరకు, తెలుగున ఒక్క ప్రామాణిక గ్రంథమైననూ ఆవిర్భవింపలేదు గదా? పోనీ – కనీసము వ్యాకరణమును బోధించుటకు అయినను ఒక ఉద్గ్రంథములేదు. అటువంటి సమయమున – భారతమును తెలుగున వినుట...అసలు గ్రంథమే ఎటుల లభించును?' నారాయణభట్టు ప్రభువునకు సర్ది చెప్ప ప్రయత్నించెను.

'లభింపవలెను ...లభించి తీరవలెను. మేమును, మాతో – మా ప్రజలును, పంచమవేదమైన మహాభారతమును తెనుగున తనివితీర వినవలెను. నాదేశమున ప్రతిఒక్కడును భారతమును చదివి, విని, అర్థము జేసికొని – సారము గ్రహింపవలె! విజ్ఞానులై ఇహపరములను, రెంటిని సాధించి తరింపవలె' రాజరాజు కంఠమున మార్పులేదు.

'ప్రభూ... ప్రభూ ... నారాయణ భట్టు కంఠమునకు – సభాసదుల కంఠములు తోడైనవి.

'నిశ్శబ్దము!' ప్రభువు విసిగికొనెను.

నన్నయభట్టారకుల వారిలో మాత్రము చలనములేదు. వారేద్దియో దీర్ఘముగ ఆలోచన సేయుచున్నారు.

'మా మాటలు పూర్తిగ వినుడు' పిదప మీ మాటలన్నియు తప్పక వినెదము!'

'చిత్తము!' నారాయణభట్టు, మల్లన అనినారు.

అందరు కూర్చొనిరి.

రాజరాజు చెప్పుచున్నాడు, '...ఆచార్య కుమారిల భట్టు – బౌద్ధ, జైనమతములను ఖం

(తరువాయి 21 వ పేజి)

## ★ ఆంధ్ర మహాభారతము ★

(12 వ పేజీ తరువాయి)

డించి, తిరిగి వైదికమతమును పునఃప్రతిష్ఠించిన విషయము, మనమందరము యెరింగినదే! ఆనాటినుండియు - మరల యజ్ఞయాగాదులు, మొదలగు కర్మమార్గములు, ఆచరించుట వృద్ధియగుచున్నది. శాతవాహనుల కాలము - అంతకు ముందే కావచ్చును - ఆనాటి నుండియు, ఆంధ్రావనియందు వేళ్లుపాతుకొనిన, బౌద్ధ, జైనములకు ప్రజాదరణ తగ్గుచున్నది. ఏకొద్ది అగ్రవర్ణముల వారే వైదికాచారావలంబులు. తిరిగి వైదికమతము వ్యాప్తిచెందుచున్న యీ సమయమున - ఎవ్వరును దీనికి చేయూత నివ్వనిచో, మరల ఏ జైనమతమో, బౌద్ధమతమో, మరింకొకమతమో - ఆక్రమణము జరుపును. కావున దీనిని ప్రజలయందు, బాగుగ ప్రచారము సేయవలెను. ప్రజాసామాన్యమునకు, బాగుగ దీనినిగురించి తెలిపిననాడె ఇది నిలచును. వైదికధర్మములు చెప్పునవి వేదములు. సర్వవేదముల సారమును, భారతమున ఇమిడ్చినాడు - వ్యాసమునీంద్రుడు. ఆ వేదసారము ప్రజలకందించి, వేదమతమైన వైదికమతమును - అడుగంటిపోకుండ చూడవలెను. అదియును గాక, తెలుగున - ఇంతవరకు - వేదములవంటి జాతీయ గ్రంథము లేవియునులేవు. అందుచేతనే - సంస్కృత వ్యాసమహాభారతమును తెనిగించుటకు పూనుకొనవలె! పూనుకొనవలె!'

రాజరాజు చెప్పుట పూర్తియైనది. దీర్ఘముగ శ్వాస తీసుకొనినాడు రాజరాజు.

అందరికిని పచ్చివెలగకాయ గొంతు కడ్డుపడునట్లైనది. ఏవరాయనకు జవాబు చెప్పగలరు? ఆయనను సమాధానపరచగల వ్యక్తి, ఒక్కడే యున్నాడు. కాని ఆ వ్యక్తియే మౌనముగా నున్నాడు.

'కాని వేదముల తెనిగించుట - అకార్యము ప్రభూ!' మల్లన మెల్లగ గొణుగుకొనినాడు.

మహారాజు అదియును వినెను. 'వేదముల నెవడు తెలుగుసేయమనిరి?' మల్లనను చూచుచు అడిగినాడు.

అసలీదినమును ప్రభువులవారికి ప్రత్యుత్తరము లిచ్చుటయే, కష్టముగ నున్నది. ఏలకో వారు యీరోజు తీక్ష్ణముగ నున్నారు.

'మేమును వేదముల తెనిగింపరాదను భావముగలవారమే - మల్లనార్యా! ఆ మాట మేమనలేదుగద! వేదములందలి విషయములను - సులభముగ అర్థము చేసికొనుటకొరకు, రమ్యముగా, కథలతోడ, ఉపాఖ్యానముల తోడ - ప్రజాసామాన్యము కొరకై - ఉద్దేశింపబడిన మహాభారతమును, తెనిగించుట పాపము, అకార్యము ఎట్లగును? మేము అట్లు తలంపము. పైగ అది పుణ్యకార్యమనియే మా భావన!'

చీమ చిటుకుమన్నను విన్పించునంతటి నిశ్శబ్దము. క్షణములు ఒక్కొక్కటియే గడచుచున్నవి.

రాజరాజు వరుసగ ఒక్కొక్కరి ముఖావలోకనమే చేయుచున్నాడు. అందరును - తమనేమని ఆజ్ఞాపించునో యని - బితుకు బితుకుమనుచు - దృష్టులను మహారాజుపైననే నిల్పినారు

ప్రభువు దృష్టి చుట్టును దిరిగివచ్చి - పొవులారి మల్లనపై నిల్చినది

'మల్లనార్యా!' రాజు పిలువనే పిలిచినాడు.

'ప్రభూ!' ఆసనముపైనుండి - త్రుళ్లిపడి - లేచి నిలువబడెను.

'మీ రేమందురు?'

'ప్రభూ...ప్రభూ...అందుకు నేను అసమర్థుడను...తడబడినాడు మల్లన.

'మరేవిషయమున సమర్థులు?'

'చి...చిత్రము! చిన్నతనమునుండి నామనసు - గణితశాస్త్రమునిన ఇష్టపడును. తమరెరిగిన విషయమే అది. కొలది దినముల క్రితము మీరాజ్ఞాపించిన విధముగ, ఒక సంస్కృత గణిత గ్రంథమును, తెనిగించుటకు బూనుకొంటిని.

'సంస్కృత గణితగ్రంథము? దాని పేరేమి.'

'గణితసారము! సంస్కృతమున దీనిని వీరాచార్యులను పండితుడు రచించెను'

'శ్రీకారము చుట్టినారా?'

'చిత్తము! చుట్టితిని. ప్రారంభపూర్వకముగ రెండుపంక్తులును రచించితిని'

'యీ విషయము మాకెందుకు నెరింగింపలేదు!'

'అపరాధమే! అంతయు ముగిసిన పిదప - తమరి నొక్కపరి ఆశ్చర్య—

'ఊఁ! ఇది రాజధిక్కారమే యగును' మల్లన మాటలను త్రుంచివైచినాడు రాజరాజు.

'రాజధిక్కారమా? ప్రభూ! నేనంత...

రాజరాజు అది వినిపించుకొనలేదు. తీక్ష్ణముగ 'ఈ రాజధిక్కారమునకు, మేము తగిన శిక్ష విధించియే తీరెదము. ఇది మా యెడ క్షమింపరాని నేరము!' అనుచు ప్రతిహారి వైపు సంజ్ఞాపూర్వకముగ జూచెను.

'ఆజ్ఞ!' ప్రతీహారి ఎదుట నిలువబడెను.

'అంతఃపురమునకు వెడలుము. మాయిచ్ఛ దేవేరుల కెరిగింపుము. అయిదు దోసిలులు ముత్యములు, గతరాత్రి శ్రేష్ఠిగారు పంపిన కాశ్మీరు ముత్యపుశాలువను - కర్పూర తాంబూల కవసరమగు వస్తువులు - పసిడిపళ్లెరమున నుంచి గొనిరమ్ము! వేగిరము!'

మరల మహారాజు - ప్రశాంతవదనమున మల్లనను, సభికులను జూచెను. నన్నయభట్టారకుల పెదవులపై చిరునగవు నాట్యమాడినది.

మల్లనకు కన్నుల నీరు దిరిగినది. ఆగ్రహమున శిక్ష విధించుననుకొన్న ప్రభువు, సత్కారమును శిక్ష నొసంగుచుండెను. క్షణమునేపు ప్రభువెంత కటకటమున బెట్టెను?

'ప్రభూ!' ఆనందబాష్పములు జాలువారుచుండ, మల్లనార్యుడు రాజరాజు మ్రోలకు వచ్చి నిలువబడెను. చేతులు రెండును జోడించి, రాజరాజునకు ప్రణామము జేసెను.

అంతలో ప్రతీహారియు, నేతెంచినాడు.

రాజరాజు స్వయముగ దనచేత విడియము చుట్టి, నన్నయభట్టారకుల వైపు చూచెను. నన్న పార్యుని మల్లనను చేరబిలిచినాడు.

'మహాప్రసాదము ! 'విడియమునందు కొని, మల్లన కనుల నద్దికొనెను.

మహారాజు తాంబూలమును కప్పుచుండ, నన్నయ భట్టారకులు 'ఇష్టార్థఫలసిద్ధిరస్తు' అని దీవించిరి.

సభికులు హర్షధ్వానములు చేసినారు.

మల్లనకు, నారాయణభట్టునకీ, సంఘటన కలవరమగ నున్నది. వారీవిధముగ జరుగునని అనుకొనలేదు. వారేమి? ఎవరుమాత్ర మూహించిరని ?

ప్రభువు అసలు విషయము మరువలేదు మరల ఆ విషయము నెత్తుకొనెను

'ఇంత గొప్ప పండితులు, కవులుఉన్నారు. ఎవ్వరును యీ సత్కార్యమును చేపట్ట సాహసింపరా?'

సమాధానములేదు.

'ఆంధ్రప్రజలకేదో - మాశక్తికొలది-మేలు చేయవలెనన్న మా అభీష్టము దీర్చువారు లేరా?'

ప్రత్యుత్తరము శూన్యము.

'ఏమి నన్నపార్యా?' రాజ రాజు నన్నయ కభిముఖుడైనాడు ఆ మాటలయందు, చూపుల యందు, యీ కార్యమునకు మీరే సమర్థులు-అన్న భావము యున్నది. అందలి ఉద్దేశ్యమును నారాయణభట్టును, నన్నయ భట్టారకుల వారును, గ్రహించినారు.

నన్నయ కొంచెము చలించెను. నారాయణ భట్టు, వదనమున ఏదో ఒకభావము, మెఱపు వలె మెఱసి మాయమైనది. అతడు స్వగతముగ నవ్వుకొనెను. ఆ నవ్వులోనే ఏదో యోచన . కావచ్చును ! యీ దినమే కావచ్చును. ప్రభువుల అభీష్టముతో బాటు, నన్నయలో గుప్తమైయున్న అమోఘ కవితాధార గంగాఝరి వలె పైకుబుకు, సమయము ఆసన్నమైనది. అందుకు ముహూర్తము యీదినమే కావచ్చు! ఇందులకు తను ప్రయత్నించవలెను. ఆ పుణ్య కార్యమున, తనుగూడ భాగస్వామియై- పవిత్రుడు కావలెను. తన వాగ్ధాటితో, యీ కార్యము సఫలమగు ప్రయత్నము చేయవలె. తన మిత్రుడగు నన్నయ స్వభావము తనకు దెలియును నారాయణభట్టు మస్తిష్కమున నన్నయభట్టారకుని స్వభావము పొడగట్టినది . నన్నయ ఎంత గంభీరస్వభావి ? ఏ విషయమైనను త్వరగ బైటపడడే! అంత నిగ్రహమెట్లు సంపాదింపగలిగెనో ? ముఖమండల మెల్లప్పుడేదో తేజస్సుతో ప్రకాశించుచుండును. ముఖ కవళికలచుబట్టి, మనసున భావములు తెలుసుకొందమన్న, ఆ వదనము ఎల్లప్పుడు నిర్మలముగనే యుండును. ఎట్టి క్లిష్ట పరిస్థితులలోనైననూ ఆ నిర్మలత్వము చెడదు - సాధారణముగ !

అతడు తనవలె "సద్బ్రాహ్మణ వంశోద్భవుడు. వేగినాటి శాఖకు చెందనవాడు, తన కన్న ఎక్కువ విజ్ఞాని. వేద వేదాంగములను అధ్యయనముచేసి, వాటియందలి విషయములను అసాంతముగ ఆకళించుకొన్న ఉత్తమ వైదికుడు పురాణములు, శాస్త్రములు - ఒక టేమి ? అన్నియు, తనయందు జీర్ణించుకొన్నాడు తెనుగున, సంస్కృతమున మేటి యనదగిన కవిత్వమును - కోకొల్లలుగ జెప్ప నేర్చిన పండితుడు. వైదికకర్మకలాపములు-యజ్ఞయాగాదులు - చేయుట యనిన, నన్నయ్యకు ఎంత యిష్టము ? నిత్యము ఆయన దన యింటి, అగ్నిహోత్రమును అనుష్ఠింపవలసినదే! ఇంత శ్రోత్రియజీవనముగడుపు వ్యక్తులు ఆనాడులేరు. యీనాడును లేరని చెప్పవచ్చును. ఉన్నారయ్యా...కానీ వారు నన్నపార్యుని యంతటి బహుముఖ ప్రజ్ఞా దురంధరులు కారు. ఆయనకున్న లోకజ్ఞానము ముందు తానెంత? అందులకే రాజరాజు-నన్నయ యనిన, అంత గౌరముగజూచును. అందులకే ఆయనకు అంత ఉన్నతస్థానము నిచ్చినాడు. .

'భట్టు గారేదియో యోచన సల్పుచున్నారే!' అన్న మహారాజు మాటలు విని తేరుకొన్నాడు నారాయణ భట్టు.

తను అనుకొన్నది ప్రభువులతో చెప్పవలెగ- అని మనసునందు అనుకొనినాడు. ఆసనమునుండి లేచి నిలువబడి 'చిత్తము ప్రభూ!' అనెను.

'ఏమది ! దీనివిషయమే అయిన తక్షణము సెలవిండు!'

'ఈ విషయమున సాహసించుచున్నందులకు, ప్రభువులు క్షమించవలె ! ప్రజాసామాన్యముకొరకై- తమ అభీష్టమును దీర్చుటకే నాయీ సాహసము.

'అయిన యెడల అది సాహసమెట్లగును ! కానేరదు ! ప్రజాక్షేమమను మహాయజ్ఞమున మీరును ఒక సమిధ వేసిన వారగుదురు!'

'తమ భావమునకు కృతజ్ఞుడను! ప్రభూ ! యీ పవిత్రకార్యమును నెరవేర్చగలవ్యక్తి... భట్టు ఆగెను. నన్నయభట్టును జూచి మరల. ఒకే ఒకరు యున్నారు' అనెను.

'ఎవరది ? ఎవరది ?' రాజరాజు ఆతృత పడెను.

'ఆ వ్యక్తి సమర్థుడన్న విషయము-అతడెవరో మీరును ఎరింగియున్నారు!'

'మేమెరింగి యున్నామా?' రాజరాజు ముఖము వివర్ణమైనది-కొంత.

'అగును ! మీరే కాదు - సభికులందరు ఎరిగినదే!'

'చిత్రము! సభాసదులెరింగి యున్నారు గూడా ? అటులైన మేమావ్యక్తి నెరింగియు, ఆతని పవిత్రనామము ఎందులకు బయల్పరచి యుండలేదు? కారణమేమై యుండును ?' నన్నయ కవీంద్రుని జూచుచు ఆలోచన నభినయించినాడు.

'ఆ మాటయు, తమ చూపును - ఆవిషయమును జెప్పుచున్నవి'

మందలించుచున్న స్వరమున, నన్నపార్యుడు 'భట్టూ!' అనెను. అతని మాటలందు గల గూఢార్థము కవీంద్రుడు అర్థము చేసుకొన్నాడు.

నారాయణ భట్టు విన్పించుకొనలేదు. 'ప్రభూ ! మీకు అతనియెడనున్న గౌరవము కావచ్చు! భక్తి ప్రపత్తులు కావచ్చు-తమరా వ్యక్తి నామము చెప్పుటకు సందేహించుచున్నారు'

'వారెవరై యుందురని మీ భావము?'

'తమరింకను నన్ను పరీక్షించుచునే యున్నారు. అతని నామధేయము...చెప్పుట మాని- నాడొక అరక్షణము...ఆ వ్యక్తి నామధేయము నన్నయభట్టు.'

(సశేషము)

# ఆంధ్ర మహాభారతము

రచన: పసుపులేటి మల్లికార్జునరావు

(గత సంచిక తరువాయి)

ఆంధ్రదేశంలో బౌద్ధమతం క్షీణించినది. శంకరాచార్యుల వారి ప్రబోధంవలన ప్రజలు వైదికమతానురక్తులు అవుతున్నారు. ఆంధ్రదేశమున వైదికమత ప్రచారమునకు పంచమ వేదమయిన భారతాన్ని తెలుగులో అనువదింపచేయవలెనని చాళుక్య రాజేంద్రుడు రాజరాజనరేంద్రుడు సంకల్పించినాడు. ఈ మహత్తర కార్యదక్షులు ఎవరా అన్న మీమాంస వచ్చినప్పుడు నన్నపార్యుని నారాయణభట్టు సూచించినాడు.

ఒక్కసారిగ అందరి దృష్టులు, నన్నయ భట్టారకునిపై కేంద్రీకరింపబడినవి. కవిరాజు హఠాత్తుగ నిలుచుండినాడు.

'భట్టూ!' తీక్ష్ణముగనున్నది కంఠస్వరము

'భట్టూ! భట్టూ... అని యూరక ఏందుల కని యెదవు? మహారాజా. భావితరముల ప్రజలు - ఒక్క ఉత్తమ గ్రంథములేదేమాయని, చింతించుట ఎందుకు? మంచి గ్రంథములు లేకున్న, వారికి విజ్ఞానము - అధ్యాత్మ చింతనము లెట్లు అలవడును. అందరును సంస్కృతమును చదవగల పండితులే యగుదురా? వేద సారమును పండితులే ఆస్వాదింపుచున్న, సామాన్య జనుల గతియేమి? అటులుండ వలసినదేనా? నీవే చెప్పుము! పండితులు అందరును, వేదములను తెనిగింపరాదను పవిత్ర భావము గలవారే! మరి పాటక జనమునకు వేదములెట్లు తెలియును? వేదములుగాక పోయిననూ, వేదముల సారమంతయు మహాభారతమున, ఇమిడి యున్నది. కనుక దానిని తెనిగించుట ఉత్తమము. మహారాజును, పండితులును, నేనును అదియే అభిప్రాయము కలిగియున్నాము. అందులకు సమర్థుడవు నీవే. అందు సందియము మినుమంతైనను లేదు.

'భట్టూ! బురదపాముపై, భూ భారమును మోప ప్రయత్నించుచున్నావు!' నన్నయభట్టు గారి కంఠమున అధైర్యము - తనీ మహా పవిత్ర కార్యమును నెరవేర్చలేనని - స్పష్ట పరచినది.

నారాయణభట్టు నవ్వినాడు. ఒక అడుగు ముందుకు వైచినాడు.

'ఎవరయ్యా బురదపాము? వేదవేదాంగ వేత్తవైన నీవా బురదపాము? బురదపామువే అయిన గౌతమీ ప్రవాహమువలె - నిర్మలము, మధురము, అయిన కవిత్వము చెప్పెదవా? బురదపామును తన గురువుగా. పురోహితునిగా, ఆస్థాన కవిగా, రాజగురువుగ స్వీకరించుటకు, రాజరాజు అంత వెర్రివాడా యేమి? బురదపామును తన మంత్రిగా నుండుటకు ఒప్పుకొనిన యీ ప్రజలకు పిచ్చియెత్తినదా యేమి? మహా మహా రాజనీతి శాస్త్రజ్ఞులకే, జటిలమగు సమస్యలందు రాజరాజునకు సలహాల నొసంగి, సమస్యా పరిష్కారము చేయగలదా? బురదపాము ప్రజాక్షేమమునకు కావలసిన, శాసనములు రాజరాజుచేత చేయించుచునా? బురదపాము యజ్ఞములు చేయునా? వేదములను పఠించునా? కవిత్వము రచించునా? ఎవ్వరైన విన్న నవ్విపోదురు! ఎవడయ్యా నిన్ను బురదపామన సాహసించిన అల్పకుడు? నా ముందరికి రమ్మనుము...

'భేష్! భేష్! కవిపుంగవా! భేష్! నన్నయ భట్టారకుల వారినే సవాలు చేయగల తమ అమోఘ వాగ్ధాటికి మేము జోహారులు సేయుచున్నాము. నరేంద్రుని కరతాళములు మ్రోగినవి. సభాసదులు రాజరాజును అనుకరించినారు.

'భట్టుగారూ! మా కోశాగారమునుండి మీకు వలసినంత ధనధాన్యములను గైకొనుడు. ఇది మా స్వంత ఆస్తి నుండి మీకొసంగుచున్నాము.

'కృతజ్ఞుడను! అనంతైశ్వర్యములు భగవానుడు మీయెడ అనుగ్రహించుగాక! అది సరియే! ఏమయ్యా నన్నయ్యా? గుడిలో లింగమువలె గూరుచుంటివేమి? నోట వెల్లమూ గొట్టుకొనలేదుగద?' నవ్వినాడు నారాయణ భట్టు.

వారిద్దరి మిత్రత్వము, చనవు అట్టిది. లేని యెడల నెవరికి నంత సాహసము? అసలు నన్నపార్యుడే మోగానీ, రాజరాజే ఆ సాహసి తలను ఒక్కవ్రేటున తెగవేయును.

వారెంతటి సన్నిహిత మిత్రులో, రాజరాజునకు తెలియును ప్రజలలోకూడ చాల మంది, యీ విషయము నెరుంగుదురు.

నారాయణభట్టు తననెంత విమర్శించినను, నన్నయభట్టారకుడు పల్లెత్తుమాట అనడు. తన మిత్రులు విమర్శలు, తన విజయమునకే సోపానములగునని, నన్నయపార్యుడు దరచు రాజరాజుతోను, తదితర మిత్రులతోను అనుచుండును. అతడు తన్నట్లు విమర్శించుట చేతనే, తను తప్పులుచేయుట నుండి కాపాడుకొనగల్గుచున్నానని, ఆయన నమ్మకము. అందుకే అతడు అంత నిండు సభయందు, తనను విమర్శించుచున్నను - ఎప్పటియట్లు నిర్మల వదనముతో వినుచున్నాడు - నన్నయభట్టు!

'ప్రత్యుత్తరము నొసంగవేమి?' నారాయణ భట్టు రెట్టించినాడు.

దేవిడీ యందలి ఘంటారావము, రెండు మారులు వినిపించినది. అనగ సభముగియుటకు, ఇంకను రెండు ఘడియల కాలమున్నది.

• 'వినుము! సభముగియుటకు ఇంకను రెండు ఘడియల కాలము మిగిలినది. ఈ వ్యవధినందు బాగుగ యోచించుకొని - నీ నిర్ణయము నెరిగింపుము! ఒక్కవిషయము జ్ఞాపకముంచుకొనుము - నీ నిర్ణయముపైననే ఆంధ్రప్రజల అదృష్ట, దురదృష్టములు ఆధారపడియున్నవి. నారాయణభట్టు - సభను, రాజరాజును - జూచి, నమస్కరించి కూర్చొనెను.

పిదప నన్నయ కూర్చొనెను. నారాయణ భట్టు కూర్చొనెను. అందరు కూర్చొనిరి.

ఒక్కొక్క క్షణమే గడచుచున్నది. రాజ రాజుతో సహా - అందరు ఉత్కంఠతతో, నన్నయ భట్టారకుని నిర్ణయమేమో యని ఆయన వైపు చూచుచున్నారు.

'భట్టా! ముందు నా సందేహములను తీర్చి, నా ప్రశ్నలకు సమాధానము నొసంగిన నేనీ కార్యమును చేపట్టుటకు అభ్యంతరమేమియు లేదు!' నన్న య భట్టారకుల నాగనిరి.

'అవశ్యము! నా సమాధానములను సాధ్యమైనంతవరకు-ఒప్పుకొనుటకు యత్నింపవలె!' నారాయణభట్టు మాటలకు-అందరు నవ్విరి!

'సరియే! నేను సిద్ధము! నీ ప్రశ్నలను ప్రారంభింపుము!'

'భట్టా! భారతమును తెనిగించుట యనిన, సులభముకాదను విషయము నీ వెరింగినదే! అందుకు ఎంతయో భాష, వ్యాకరణము, ఛందస్సు, అవసరము!'

'కాదని ఎవరన్నారు?'

'ఇంతకు ముందు-నీవే ఒక్క ప్రామాణిక మైనను, వ్యాకరణమునకు- లేదని నీవే ఒప్పుకొని యున్నావు!'

'ఔను!'

'మరి నేనెటుల యీ గ్రంథమును అనువదింపగలను?

నారాయణభట్టు నవ్వుటకు మొదలిడినాడు ఆ నవ్వేమో ఎవరికిని అర్థముకాలేదు.

'నవ్వు నాపుకుని 'భలేవాడవు! మొత్తము మీద భలే ప్రశ్న వైచినావు లెమ్ము! ఏదో విధముగ తప్పించుకొందమని! నేను పడనిచ్చెదనా? నీకేమి? ప్రామాణిక, వ్యాకరణ గ్రంథములు కావలెనా? నీవు తలచుకొన్న ఆ వ్యాకరణ గ్రంథమును రచింపగలవు! ఒక టేమి ఖర్మము? వందలకొలది రచించు శక్తి గలవాడవు నీవే ఒక వ్యాకరణపు పుట్టవు. నీవొక వ్యాకరణ గ్రంథమును రచించిన, ఆ కొఱతియు దీరును' అనెను.

'సమయమునకు జ్ఞప్తికి దెచ్చినారు భట్టుగారూ! నన్నపార్యా! ఒక క్రమములేక, శకావికలైయున్న ఆంధ్రవ్యాకరణమును, గ్రంథస్థము గావించిన కీర్తియును మీకు దక్కును. భావికవులకు మార్గదర్శకులు మీరే యగుదురు. ఏ కవియైనను - మీకు మ్రొక్కి గాని గంటము చేపట్టడు.' రాజరాజు అనెను.

ఇందులకు కారణము నీవే యన్నట్లు-స్నేహపూర్వకమగు చిరుకోపమున, నారాయణ భట్టును జూసినాడు- నన్నయ భట్టారకుడు. నారాయణభట్టు సగర్వమున జూచినాడు మగల.

నన్నపార్యుడు మాటాడలేదు. తిరిగి యోచనామగ్నుడైనాడు

ఒకటి... రెండు... మూడు... నాలుగు అయిదు క్షణముల కాలము గడిచినది. నన్నయ భట్టారకులవారి నోటినుండి, ఒక్కొక్క వాక్యమే వెలువడినది '.నేను యీ భారమును మోయుటకు సిద్ధపడుచున్నాను.

అందరి మోములు వికసించినవి.'

'నన్నయ భట్టారకులు చిరంజీవులు- వారి నామము చిరంజీవము' అను కేకలు చెలరేగినవి.

రాజరాజు ఎనలేని సంతసమున, కవివరేణ్యుని పాదములనందుకొన బోయినాడు- సింహాసనమునుండి లేచి! కవీంద్రుడాతని భుజముల బట్టుకొని ఆపి 'ఇది యేమి?' అనెను.

రాజరాజు ఆ మాటలను వినపించుకొను స్థితియందు లేడు. కుడి ప్రక్కకు జూచి ఏదియో ఆజ్ఞాపింపబోవునంతటిలో, భటుడొకడు, వెండి పళ్ళెరమున - ఒక ప్రక్క ముత్యములతో నుంచబడిన తేతమలపాకులు, కర్పూరాది సుగంధ ద్రవ్యములు. మరియొక ప్రక్క పట్టు వస్త్రములు, సన్నని గవసెల్లాలు యుంచుకొని, ఎదుట నిలువబడినాడు.

'ఓ! మా అభిప్రాయము నెరింగి - తదనుగుణ్యముగ ప్రవర్తించినావు! నీ అప్రమత్తతకు సంతసించినాము. 'మెడలోని హారము దీసి' అతనికి బహూకరించినాడు. ఆ కంచుకి అదృష్టవంతుడు!

జ్ఞాపకమువచ్చి, 'ఆఁ! కవివరేణ్యులకు తాంబూలమిచ్చి సత్కరించుటనంతటి వారము గాము! ఇందుకు, వారి మిత్రులు - వారితో సమాన ప్రతిభా సంపత్తి గలిగిన, నారాయణ భట్టుగారే సమర్థులు. అనుచు నారాయణ భట్టువైపు చూసెను.

'కాదు ప్రభూ! నేను...

'రాజేంద్రా' మధ్యలో నన్నపార్యుని కంఠము వినిపించెను.

'ఏమి కవివర్యా!'

'నేనొకమాట చెప్పెదను! అటుల జేసెదవా?'

'సెలవిండు!'

'ఒక మనిషి యున్నాడనుకొనుము! ఆ మనిషి ఒకచో గౌరవము పొందెను. అతని గౌరవమునకు కారణము- మరియొక వ్యక్తి కారకుడు వారిద్దరిని సత్కరింపవలసివచ్చిన ముందు నెవరిని సత్కరించెదవు?'

రాజు ఒకక్షణమాలోచించి 'నిస్సందేహముగ ఆ మరియొక వ్యక్తిని' అనెను.

'ఎందుచేత?'

'ఆ మనిషియొక్క గౌరవమునకు, ఆ మరియొక వ్యక్తియొక్క ప్రతిభా విశేషములే కారణము! అందుచేత!'

'అంగీకరించినావు గద! భారతాంధ్రీకరణమను మహాయజ్ఞమును, నాచేత చేయించుచున్నావు ఈ కార్యము నాపాలబడుటకు, నాకీ గౌరవము కలుగుటకు కారకులెవరు?'

'నారాయణభట్టుగారు!'

'కావున యీ గౌరవము అతనికే దక్కవలెను!'

'వారు చెప్పినది నిజము! నన్నయగారి వాక్యములు సత్యము!' సభికుల కంఠములు ఒక్కటైనవి.

'అగును! అటులే చేసెదము! సభికులారా నిశ్శబ్దము! భట్టుగారూ తమ రొక పరి ఇటు దయచేయవలెను!' రాజ రాజనెను.

'చివరకు శ్రీలక్ష్మి నా పాలబడవైచినాడు! యీతడేమి మిత్రుడు? నాకు గలుగు నష్ట

ములు తను గ్రహించి, లాభమును నాకొసంగును! ప్లైగ ఇదియేమోయి యనిన కోపము !' అనుచు రాజరాజు వద్దకు వచ్చినాడు.

ఆ మాటలే చాలును- వారి మిత్రత్వము తెలుపుటకు! సభికుల హర్ష ధ్వానముల మధ్య, రాజ రాజందించిన తాంబూలము - తన చేతి మీదుగ నారాయణభట్టు కొసంగెను. రాజ రాజు పట్టు వస్త్రమును కప్పినాడు- స్వయముగ.

'ప్రభూ! తను పొందవలసిన సత్కారము లను నాపై వేసి తాను తప్పించుకొన్నాడు. కావున-మరల నన్నయను సత్కరింపనిదే, నేనీ గౌరవమును పొందినట్లు భావింపను. తాము అవశ్యము అతనిని సత్కరించవలెను !'

'ఊం! భట్టూ! అన్నియు నామీదకే ప్రయోగించెదవు!' నన్నయ అనెను.

'నీ అంతటి సన్నిహితమిత్రులు నాకెవరున్నారు ?'

'ఎవ్వరును లేరా?'

'ఉన్నారే అనుకొనుము! వారు నీ వలె నా నోరు మూయింపలేరు! మాటలు పెంచవలెనన్న పెంచెదవు త్రుంచవలెనన్న త్రుంచెదవు !'

కవితా బలమున నిరువురు సమానులే! రెండు సింహములు ఢీకొన్నట్లున్నది వారి ధోరణి !

'అది పోనిండు! యీ శుభసమయమున - కవీంద్రులకు 'వాగనుశాసను'డను బిరుదనొసమిచ్చి- వారియెడ మాకుగల గౌరవము, భక్తి- మరియొకమారు సూచింపదలచుకొంటిమి.

జయ జయ రాజ రాజ నరేంద్ర ... జయ ధ్వానములు, కరతాళధ్వనులు నిశ్శబ్దమును ఛేదించుచు మిన్ను ముట్టినవి.

రాజభటుడు నిశ్శబ్దము! నిశ్శబ్దము! అని ఎంత అరచినను ఆ కలకలము అణగలేదు. చివరకు డాలుపై గట్టిగ చప్పుడు చేయవలసి వచ్చినది.

'మహారాజా! అటులనే కావింపుడు! మన యీ సత్కార్యములన్నియు, నన్నయ పార్శ్వమున చంద్రుని కొక నూలుపోగువంటివి! పావులూరి మల్లనార్యుడనెను.

రాజ రాజు నిలుచొనెను. నన్నయభట్టు నిలుచొనెను.

ఆనాటి నుండి, నన్నయభట్టు- వాగనుశాసనుడనికూడ పిలుపబడుననీ, రాజు స్వయముగ ప్రకటించినాడు. తన చిటికెన వేలికి ధరించు అంగుళీయకము దీసి, నన్నయగారి చిటికెనవ్రేలికి దొడిగి, భక్తిపూర్వకముగ నమస్కరించెను. ఆయన చేయెత్తి దీవించి, ఒక అడుగుముందుకు వైచి- 'భట్టూ! ఒక్కమారిటు వచ్చెదవా ?' అన్నాడు.

వచ్చెదవాయేమి ? రాజంతటి పురుషునే ఆజ్ఞాపించెదవు ! నన్నును ఆజ్ఞాపించుము.' అనుచునే దగ్గరకు వచ్చినాడు.

'కాని నిన్ను ఆజ్ఞాపించలేను భట్టూ !'

'ఎందులకేమి ?'

'ఎందులకన - నీవు మిత్రుడవు !'

'హా! స్నేహధర్మమును మించిన ఉద్యోగ ధర్మమున్నది గదా ?'

'ఉండనోపు! అటుల దూరముగనే ఉంటే వేమి ? ఇటుల చేరరమ్ము !'

'వచ్చితిని !' మరికొంత సమీపమునకు జరిగెను.

'ఇంకనూ !'

'ఇంకా? నా యెదుట నీవున్నావు ! నీ మీద సిల్వానముందువా ?'

'తప్పేమి ?' అనుచు, దగ్గరకు వచ్చిన మిత్రుని ఆలింగనము జేసికొనెను నారాయణ భట్టు మిత్రుని మనస్సు ఎరిఁగినాడు.

'నన్నయ్యా ! నా మాటలు నిన్ను నొప్పించెనా? నన్ను క్షమింపుము!' మిత్రప్రేమ యుట్టిపడుకంఠస్వరమది.

'లేదు మిత్రుడా! లేదు! ఇంత విద్యావంతుడవని, నీ విమర్శలు నాచేత యీ గొప్పకార్యము చేయించునని, నే నెన్నడు తలంచలేదు !'

'ధన్యుడను !'

'నీవు కాదు - నేను ! కాదు - నీవు, నేను, ప్రభువు, ప్రజలు అందరూ ధన్యులే!'

వారిరువురేమి మాటలాడుకొనిరో, రాజ రాజునకు, అచటయున్న మరి యిరువురి యిరువురి భటులకు మాత్రమే విన్పించినది.

మిగతవారు మాత్రము - సమాన ప్రజ్ఞావంతులైన యిరువురు కవీంద్రులను, సరసుడు- కవిపోషకుడు - కళావేత్తయైన రాజోత్తముని ఒక్కచో తిలకించి - సంతోషము చెందినారు. ఆనంద బాష్పములు రాల్చినారు.

అంతలో - సభ ముగియుటకింక కొద్దిక్షణముల సమయము మాత్రమే, యున్నదని తెలుపుచు గంటమ్రోత వినవచ్చినది.

సభికులలో, కలవరము బయలు దేరినది అందరు గృహముల కేగుటకు ఆయత్తపడు చుండుటయే, అందుకు కారణము.

'నిశ్శబ్దము! సభికులారా! నిశ్శబ్దము' చివరి సారిగ నేను మీతో ఒక్కకోరిక కోరవలసి యున్నది! ఘంటికారావమును మించి, విన్పించినది నన్నయ భట్టారకుల వాణి.

మరల! అందరు కూర్చున్నారు. సవ్వడి చేయకుండ

'రాజరాజా! నీవు నాకొసంగిన యీ కార్యము పూర్తియగుట కెన్ని దినములు పట్టునో చెప్పలేను. ఇన్ని దినములలో పూర్తి చేయగలనని బీరములు బలికి, తదుపరి నావాగ్దానమ్ము చేయలేను.

'కానిండు, పూర్తి యగునప్పటికే యగును. కానీ తమరు ఎప్పటికప్పుడు, మాకు దీనిని వినిపింపవలె, అందులకు మా మనస్సు ఉవ్విళ్ళూరు చున్నది

'అటులనే మరింకొక మనవి'

'ఏమది ?'

'మీరనినటుల యజ్ఞయాగాదులు, మొదలగు కర్మమార్గములు పునరుద్ధరించుటకీ మహాభారతాంధ్రాను వాదము తోడ్పడుగాక! అయినను నేను మతమునే ప్రసాదించవలె నన్న దృష్టితో దీని నాంధ్రీకరింపను. సర్వమతముల వారు, దీనిని చదివి, విని ఆనందించవలెను. అప్పుడీ గ్రంథము విలువ ఒకటికి పది రెట్లగును. రాజరాజని నటుల సర్వులు మరల కర్మమార్గముల పై గురికుదిరి- ఆదరించబూను

కొన్న వచ్చు. సంకుచిత దృష్టితోగాక విశాల బుద్ధి నుపయోగించి రచించిన - అది మనకే శ్రేయస్కరము కీర్తివంతము'

'మంచిది నన్నపార్యా! తమరి నిష్పాక్షిక దృష్టికి జోహారు సేయుచున్నాను.'

'చివరి కోరిక'

'ఆజ్ఞాపించుడు'

'ఈ కార్యమును నేనొక్కడను జేయుట కన్న, నాకు తోడు మరి యొకరున్న యెడల మరింత త్వరగ, ముగియ వచ్చును. అందుకు నాకు సహాయకారిగ నా ఆప్తమిత్రుడు, నన్ను విమర్శించి సరిగిద్దువాడును అగు నారాయణ భట్టును వినియోగింపుమని మనవి!'

'నన్నయ్యా!' భట్టు తడుముకొనినాడు - మాటలకు.

'అగును! భట్టుగారూ! మీరేతప్ప నన్నయ గారికి సహాయులుగ నుండదగిన వారెవ్వరును లేరు. తాము అంగీకరించుడు' అల్లంత దూర మున ఆసనమున కూర్చొనియున్న పావులూరి మల్లనార్యుగారు నిలువబడెను.

'ప్రభూ మీరైన జెప్పుడు. నేనిందులకు సమర్థుడనా?' ప్రభువున కభిముఖుడైనాడు. నారాయణ భట్టు.

'ఇందుకు సమర్థులు మీరే. మీరు గానిచో మరెవ్వరును గారు. కానిచో - మా కసాధ్యమగు విషయము మేము జెప్పలేక సందేహించు సమయమున, సాహసమున, వారిని మిత్రత్వపు చనవున- ఎత్తిపొడుపులతో అంగీకరింప జేయగలరా?' నన్నయగారి మాటలకు ఎదురాడవలదని మా కోరిక. వారిని మీరు 'సరే, యనిపించినారు. మేము మిమ్ములను ఒప్పించెదము. భట్టుగారూ! తమరు ఊం అనుడు'

'అందరును అదేమాట మరల నన్నయ్యే జయము నందినాడు'

ఆ మాటల తరువాత — అంతయూ నిశ్శబ్దము.

'మొన్నటి రాత్రి గాబోలు... రాజరాజు తమ పూర్వీకులైన పాండు నందనాది మహాపురుషుల చరిత్ర మగల వినవలెనని గుతూ హలము వ్యక్తపరచిరి ఆ దినము నేను సంస్కృత వ్యాసభారతము వినిపించితిని. గారి అట్లనుటలో రాజరాజు ఉద్దేశ్యము నేను ఎరుగలేదు. ఎంతైననూ వారి హృదయము అగాధము. మహారాణియే అనును - గురు వర్యా! ప్రభువులవారి పట్టమహిషినై ఇన్ని దినములైనది. వారిని నేను సమగ్రముగ అర్థము జేసుకొనలేకపోయితిని నన్నయ్య మాటలు నారాయణభట్టుకే వినబడినవి

సభాసమయము ముగియబోవు చున్నది అది తెలుపుచు కోటయందు- సుదీర్ఘ ఘంటా రావము వినిపించుచున్నది.

రక్షకభటులు ప్రభువు వెనుక నిలువ బడినారు.

ఆ దినమే — ఆంధ్ర మహాభారతాంధ్రీకరణమునకు అంకురార్పణము జరిగినది.

◆ ◆

దినములు కొన్ని — పుటలవలె దిరిగి పోయినవి.

ఒకానొకనాటి సుప్రభాతము —

అదియే గోదావరీ తీరము అదియే వేంగి రాజ్య రాజధానీ నగరము — రాజమహేంద్ర వరపురము. అదియే సభాభవనము

ఆంధ్రమహాభారత రచనమను మహా యద్ధము ప్రారంభమైనది. శ్రీకారము వద్ద నుండి - మొదలు ఆదిపర్వమున కొంతభాగము రచన జరిగినది. దానినే — నన్నయ భట్టార కులవారు శ్రావ్యముగ చదివి వినిపించు చున్నారు నారాయణ భట్టు, మహారాజు, మల్లనార్యుగారు — తదితర ప్రజాసమూహాము.

చోటు చాలలేదు. సభ కిటకిట లాడి పోయినది

రచన జరిగినంతవరకు - ప్రతిపదార్థ తాత్పర్యములతో సోదాహరణము వినిపించుట పూర్తి యగుసరికి సూర్యుడు ఆకాశ మధ్యమునకు వచ్చెను ఆ రసామృతమును గ్రోలుటలో ఎవరికినీ కాలమే తెలియలేదు. ఆనాడు మహారాణియు - తదితర అంతఃపురవాసులు రాజబంధువులు అందరు వచ్చిరి.

ఇనుమడించిన భక్తితో, భార్యాసమేతుడై మహాకవీశ్వరునివద్ద సెలవు గైకొనుచున్నాడు.

బ్రహ్మ వర్చస్సున ప్రకాశించు — బృహ స్పతివలె నున్న కవిరాజు, ఆయనముందు సవినయులై దేవేంద్ర దంపతుల వోలె భాసించు చున్న రాజదంపతులు.

రెండుకన్నులే చాలవు...ఆ దృశ్యము నెంత జూచిననూ తనివి దీరదు....దీరదు...

రాజ రాజు, నన్నయ, నారాయణ భట్టు వంటి బిడ్డలగన్న ఆంధ్రమాత అదృష్టవంతురాలు...

మహాభారతమును అనువదించు కొనగలిగిన ఆంధ్రసాహితీ క్షేత్రము ఫలవంతమైనది ...

అంతేందులకు ? ఒక్కమాటలో

ఆంధ్రులు అదృష్టవంతులు.

## ముగ్గురు పిసినారుల కథ

అనగానగా ముగ్గురు పిసినారులుండేవారు. ఒక రోజున ఆ వూరి దేవాలయంలో హరికథ జరుగుతుంటే ముగ్గురూ వెళ్ళారు. హరికథ అవబోతుండగా దేవాలయ ధ్వజస్తంభం బాగుచేయించడానికి విరాళాలిప్పించవలసిందిగా దేవాలయ ధర్మకర్త ఉద్బోధించాడు. ఆ మాట వినీ వినగానే పదిమంది భక్తులు పళ్లాలు పుచ్చుకుని విరాళాలకు బయలుదేరారు. ముగ్గురు పీనాసుల వైపుకూ విరాళాల కోసం ఒక భక్తుడు వస్తున్నాడు. ఇవ్వము అని చెప్పడానికి మనస్కరించలేదు — ఇవ్వడానికి మనసొప్పలేదు. ఏం చేయ్యాలి?—వెంటనే ఆలోచన తట్టింది.

ఒకాయన "మూర్ఛ పోయాడు." మిగతా యిద్దరూ అతన్ని "మోసుకుపోయారు."